# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 251
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
జూలై 07, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## బీఆర్ఎస్ ఆందోళన

- ములుగులో ఉద్రిక్తత
- గులాబీ నేతల ముందస్తు అరెస్ట్
- పోలీస్ బందోబస్త్ నడుమ మంత్రుల పర్యటన




- అన్ని రంగాల్లో ముందడుగు
- ఏఐ, సైబర్ క్రైంపై పెరుగుతున్న అవగాహన
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ఘనంగా కేయూ 23వ స్నాతకోత్సవం
- గవర్నర్ చేతుల మీదుగా 373 మంది విద్యార్థులకు పీహెచ్ డీ పట్టాలు ప్రదానం

# విద్యతోనే మనుగడ

విద్య ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తించాలని రాష్ట్ర గవర్నర్, కాకతీయ యూనివర్సిటీ చాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. వైస్ చాన్స్ లర్ కె.ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన కేయూ 23వ స్నాతకోత్సవాన్ని సోమవారం కేయూలోని సెనెట్ హాల్ లో కన్నుల పండువగా నిర్వహించారు. గవర్నర్ తోపాటు ఈ వేడుకలకు సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఉదయం 11.30గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయం చేరుకున్న గవర్నర్ చేతుల మీదుగా కేయూకు చెందిన 387 మంది విద్యార్థులకు పీహెచ్ డీ పట్టాలను ప్రదానం చేశారు. అదే విధంగా 373 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, ఎగ్జామినేషన్ కంట్రోలర్ కట్ల రాజేందర్, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. రోడ్డు మార్గంలో ఉదయమే కాజీపేటలోని నిట్ కళాశాల అతిథి గృహానికి చేరుకున్న గవర్నర్ కు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరును గవర్నర్ సీపీని అడిగి తెలుసుకున్నారు. - వరంగల్ వాయిస్, కేయూ


వివరాలు2లో..



## 23 ఎజెండా అంశాలు

- రూ.149.29 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- మేయర్ సుధారాణి అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం

## ప్రజాపాలన కాదు.. నిరంకుశ పాలన

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


2లో..



8లో..

## పర్యాటకంగా కర్రె గుట్టలు

- లక్ష కోట్లతో రైతులకు సంక్షేమ ఫలాలు
- నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క







# విద్యతోనే మనుగడ

- అన్ని రంగాల్లో ముందడుగు
- ఏఐ, సైబర్ క్రైంపై పెరుగుతున్న అవగాహన
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ఘనంగా కేయూ 23వ స్నాతకోత్సవం

**వరంగల్ వాయిస్, కేయూ :** విద్యార్థులు ప్రయోగశాలలకే పరిమితం కావద్దని, వారు సంఘ సంస్కర్తలుగా మారాలని రాష్ట్ర గవర్నర్, కాకతీయ యూనివర్సిటీ చాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవం కార్యక్రమానికి హాజరైన గవర్నర్ మాట్లాడుతూ విద్య, వికాసం, నూతన ఆరంభాలకు కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల సంకల్పానికి గుర్తింపు అని అన్నారు. మీరు కేవలం డిగ్రీ పొందలేదనీ వెనక్కి చూడకూడదని, ఒక బాధ్యతను, ఒక ఆశయాన్ని, దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారే అవకాశాన్ని స్వీకరించారనీ గుర్తించాలన్నారు. విద్యార్థుల విజయానికి వెనుక నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా గవర్నర్ అభినందనలు తెలియచేశారు.

### రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో..

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్, జిల్లా పాలకవర్గ సభ్యుల మర్యాద పూర్వక కలిసి పుష్పం అందించి శుభాకాంక్షలు తెపారు. నిట్ అబ్దుల్ కలాం గెస్ట్ హౌస్ లో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణా రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్ కు శాలువా కప్పి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను గవర్నర్ అభినందించారు.

### టీబీ ముక్త్ అభియాన్..

కేయూ స్నాతకోత్సవం అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాలలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల తీరుతెన్నులపై రెండు జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గవర్నర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. దేశంలో టీబీ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రధాని టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు స్క్రీనింగ్ క్యాంపులను విస్తృతంగా నిర్వహించి టీబీ కేసులను గుర్తించాలన్నారు. ప్రజల్లో టీబీ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. టీబీ నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన పేషెంట్లకు దాతల ద్వారా పోషక ఆహార కిట్లను అందించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాకు రూ.60వేలు, వరంగల్ జిల్లాకు రూ.40వేలను టీబీ పేషెంట్లకు పోషకాహార కిట్లను అందించేందుకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి విరాలంగా అందజేశారు. అదేవిధంగా డాక్టర్ వాసవి రాకేష్ రెడ్డి దంపతులు, హనుమకొండ జిల్లాకు రూ.50 వేలు, డాక్టర్ వంగ హేమంత్ రెడ్డి రూ.20వేలను రాష్ట్ర గవర్నర్ సమక్షంలో కలెక్టర్లకు అందజేశారు.

ఈ సమావేశంలో టీజీఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, డీఎంహెచ్ ఓలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆచార్య, ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

### భారీ బందోబస్తు..

గవర్నర్ రాక సందర్భంగా నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ రాజ్ భవన్ నుంచి రోడ్డు మార్గంలో బయలు దేరిన గవర్నర్ నేరుగా కాజీపేటలోని నిట్ క్యాంపస్ కు చేరుకొని కొద్ది పాటు విరామం తీసుకున్నారు. అనంతరం కేయూలో నిర్వహించిన స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అక్కడే మధ్యాహ్నం భోజనం చేసిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ 2.30 నుంచి 3 గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రోడ్డు మార్గాన తిరిగి రాజ్ భవన్ కు వెళ్లారు. గవర్నర్ రాక సందర్భంగా నగరంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.











# ప్రజాపాలన కాదు.. నిరంకుశ పాలన

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇందిరమ్మ ఇల్లు రాలేదన్న బాధతో ఆత్మహత్య చేసుకున్న రమేష్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తోపాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాకేష్ రెడ్డి తదితరులను పోలీసులు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ వద్ద అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వెంటనే అక్రమ కేసులతో బెదిరింపు పాల్పడుతున్నారని నరేందర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో సాగునీటి హామీలు, రుణమాఫీ, పంటల మద్దతు ధరలు అంటూ రైతుల గుండెచప్పుడు వినగానే మాటల వర్షం కురిపించిన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ కాకపోవడం, రైతులకు సకాలంలో యూరియా, విత్తనాలు సరఫరా చేయకపోవడం, నిర్మాణంలో ఉన్నటువంటి నీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఒక నివేదిక ఇవ్వకపోవడంపై పూర్తి మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ఇప్పుడు ఆ మాటలు గుర్తు చేయడమే రాజద్రోహమా? ప్రజల తరపున పోరాటం చేస్తే కేసులా అంటూ నిలదీశారు.

# ప్రణయ్ భాస్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలి

## ◆ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఓరుగల్లు ప్రజలకు అత్యంత సన్నిహితుడు, దివంగత మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి, వర్ధంతి వేడుకలను దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన తనయుడు, కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్, తన తల్లి దాస్యం సబితా భాస్కర్, సోదరి, బావ అపూర్వ రంజిత్ లతో కలిసి ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ వేడుకల్లో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొని, ప్రణయ్ భాస్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ఈటల రాజేందర్ స్మరించుకున్నారు. తొలుత వడ్డేపల్లిలోని వారి స్వగృహంలో పూజా కార్యక్రమాల అనంతరం ప్రణయ్ భాస్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత వడ్డేపల్లి గ్రామ ప్రణయన్న ఆప్తులు, అభిమానులతో కలిసి సుబేదారిలోని ప్రణయ్ మార్గ్ వద్ద ప్రణయ్ భాస్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి, నినాదాల నడుమ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ, ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, దేశ ప్రధాని కొడుకుతో ఢీకొని గెలిచి తన సత్తా చాటిన ప్రణయ్ భాస్కర్ రాజకీయాల్లో ఎందరికో ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ప్రణయ్ మిత్ర మండలి, ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహృదయ అనాథ వృద్ధాశ్రమం (కాజీపేట), డబ్బాల్, కుమార్ పల్లి మార్కెట్, ఎంజీఎం సర్కిల్, చామన్ ప్రాంతాల్లో అన్నదాన, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన ఏకైక రాజకీయ వారసుడిగా, ఆయన ఆశయాల సారథిగా, ఆయన చేయాలనుకున్న, మధ్యలో ఆగిన అంశాలను పూర్తి చేస్తానని అభినవ్ భాస్కర్ స్పష్టం చేశారు. అంతేకాదు, మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ప్రణయ్ భాస్కర్ అంటూ గత ముఖ్యమంత్రి కేసీఆర్, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఆయన సేవలను కొనియాడిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితోనే తన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తానని అభినవ్ అన్నారు. ప్రణయ్ భాస్కర్ కు ప్రభుత్వ పరంగా రావాల్సిన, దక్కాల్సిన గౌరవం వాస్తవికంగా జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణయన్న ఆప్తులు, స్నేహితులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గోపు చైతన్యకు బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ పట్టా



**వరంగల్ వాయిస్, కేయూ :** హనుమకొండ నగరంలోని మచిలీ బజార్ కు చెందిన గోపు చైతన్య కాకతీయ యూనివర్సిటీ నుంచి బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ డిగ్రీ పట్టాను అందుకున్నారు. సోమవారం కేయూ సెనేట్ హాల్‌లో జరిగిన 23వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. గోపు చైతన్య కేయూ విశ్వవిద్యాలయంలో ఆచార్య తాడూరి శాస్త్రి పర్యవేక్షణలో "IN VITRO STUDIES PHYTOCHEMICAL SCREENING AND SILVER NANOPARTICLE PRODUCTION IN MOMORDICA CYMBALARIA FENZI" అనే అంశంపై పరిశోధన చేసి ఈ డాక్టరేట్‌ను పొందారు. చైతన్య 2021 జూలై 8న తన పీహెచ్‌డీ డిగ్రీకి అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయం ధృవీకరించింది. నేడు గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను పొందడం పట్ల కేయూ బోధన, బోధనేతర సిబ్బందితో పాటు ఆమె కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

# పని గంటల పెంపు జీవోను వెంటనే రద్దు చేయాలి

## కలెక్టరేట్ ఎదుట జీవో కాపీల దగ్ధం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 గంటల నుంచి 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన 282 జీవో ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను దగ్ధం చేశారు. "ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలి", "కార్మిక వ్యతిరేక చర్యలు ఉపసంహరించుకోవాలి", "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ, కార్మికుల శ్రమను కారు చౌకగా మరింత దోపిడీ చేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిగంటలను పెంచిందని విమర్శించారు. కార్మిక వర్గం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఈ సమయంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడవడం కేంద్ర, రాష్ట్ర పాలకుల కార్మికుల పట్ల ఆలోచనా ధోరణిని తేటతెల్లం చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక ఉత్తర్వులను రద్దు చేయాలని, లేకపోతే కార్మిక ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. తక్షణమే, బేషరతుగా జీవో 282ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి. ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, బరుపట్ల మహేష్, మంద మల్లేశం, గొడుగు వెంకట్, కె. రవీందర్, బొట్ల కుమారస్వామి, రవి, రీల్ పూర్ణచందర్, పాపయ్య లతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ (జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి), జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించిన ఆయన, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, సిబ్బందితో మాట్లాడుతూ, వర్షాకాలంలో గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే విధంగా చూడాలని, ఇంటి చుట్టూ పక్కల నీరు నిల్వ లేకుండా డ్రై డే పాటించి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన జాతీయ పథకాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సరోజ, సీహెచ్‌ఓ భద్రయ్య, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేద ప్రజలను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తోందని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. పరకాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డుకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు బొమ్మకంటి రుద్రమదేవి – చంద్రమౌళి దంపతులకు మంజూరైన ఇంటి నిర్మాణానికి రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి, ముగ్గు వేసి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. గత పదేళ్లుగా ఏ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయని ప్రభుత్వం అసమర్థ పాలన సాగించిందని రాజిరెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమదేవి – చంద్రమౌళి, ఎస్సీ సెల్ అధ్యక్షులు హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్, కాంగ్రెస్ నాయకులు మచ్చ సుమన్, పోరండ్ల వేణు, బొచ్చు మోహన్, బొచ్చు జెమిని, దావు పరమేశ్వర్, వార్డు ఆఫీసర్ కృష్ణంరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మడికొండ కవిత – చంగల్ రావు, రిటైర్డ్ హెచ్‌ఎం ఆకునూరి పుష్ప విజయ్ కుమార్, రిటైర్డ్ సీఎస్ఐ పాస్టర్ రే. బొచ్చు ప్రకాశం, మంద మహేష్, ఒంటేరు అమర్నాథ్, కుక్ మూడి రాజారాం, చుక్క శాంతి కుమార్, దుప్పటి అన్నయ్య పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## ◆ కార్మిక, రైతు సంఘాల బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నేడు వరంగల్‌లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వరంగల్ గ్రెయిన్ మార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, కాశీబుగ్గ, పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా మీదుగా రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం రైల్వే స్టేషన్ సెంటర్ లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐసీటీయూ, ఏఐకేఎంఎస్, టీయూటీసీ, ఐఎఫ్ టీయూ, ఏఐఎఫ్టీయూ నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గత 11సంవత్సరాల నుండి కార్మిక రైతువ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్రా ప్రతాప్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, సీఐటీయూయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండీ బషీర్, ఆరూరి కుమార్, ఏఐసీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి యాదగిరి, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఏఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు బైరబోయిన ఐలయ్య, ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు బండి కుమార్, టీయూసీఐ నాయకులు కృష్ణారావు, ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరిలతో పాటు ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన గజ్జి కమల(55) గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ సూర్య హాస్పిటల్ ఎం.డీ. గజ్జి సురేష్, సూర్య ట్రస్ట్ చైర్మన్ గజ్జి విష్ణు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన సురేష్, విష్ణు.. పేదింటి పెన్నింటి పెద్దలుగా భావించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యూత్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర:** ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దామెర మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దామెర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాదిగ, దామెర మండల గ్రామ శాఖ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ మాదిగతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఉద్యమ ఆవశ్యకతను, భవిష్యత్తు ఎస్సీ వర్గీకరణ మాదిగ జాతికి తెచ్చిన ఆత్మగౌరవాన్ని రవికుమార్ మాదిగ వివరించారు. మందకృష్ణ మాదిగ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దామెర మండల సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో పాటు దామెర మండల బీజేపీ మాజీ సర్పంచ్ గురజాల శ్రీరామ్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజకుమార్ మాదిగ, దామెర గౌరవ అధ్యక్షుడు ఈరెల్లి హరీష్ మాదిగ, దామెర గ్రామ ప్రధాన కార్యదర్శి కొడకండ్ల శ్రీను మాదిగ, ప్రశాంత్ మాదిగ, దామెర రమేష్ మాదిగ, కొడకండ్ల చిరంజీవి మాదిగ, దామెర కుమార్ మాదిగ, వేల్పుల ప్రసాద్ మాదిగ, దామెర టీచర్ బాబు, ఎడ్ల రాజు, సారా సుధాకర్, దామెర ఆనందం, దామెర నిఖిల్, వేల్పుల శ్రీకాంత్, మామిడి వేణు, వినయ్ బాబు, సాంబయ్య, చంద్రయ్య, దామెర రాజేందర్, దామెర సంపత్, కొడకండ్ల కొమురయ్య, ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవం జమ్మికుంట మండలం కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలలో సోమవారం ఘనంగా జరిగాయి. కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడుకలకు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, వేలగొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి జెండాలను ఆవిష్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కోరపల్లి గిరవేన ఓదెలు, వెంకటేశ్వర్ల పల్లి ఉపసర్పంచ్ పోల్సాని శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ బండారి రాజకుమార్, బుడగ జంగం జిల్లా నాయకులు రేపెల్లి వెంకటేష్, నేతకాని సంఘం నాయకులు కొండు బిక్షపతి, హమాలి సంఘం నాయకులు బండారి శ్రీధర్, బీజేపీ నాయకులు రెంటాల మహేందర్, నాయి బ్రాహ్మణ సంఘం కొత్తగట్టు సంపత్, మైనారిటీ నాయకుడు ఎండి రహీం, యాదవ సంఘం అధ్యక్షులు గిరవైన సతీష్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని అంకుస్, మాట్ల సంజీవ్ కుమార్, నాగిళ్ల ఓంకార్, గాజుల అర్జున్, పుల్లూరి రాజు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెను ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల ఉపాధ్యక్షులు బొమ్మకంటి రవి మాదిగ, మండల నాయకులు, మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య మాదిగ పాల్గొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కుల పెద్దలు, సభ్యులైన బొమ్మకంటి పోశాలు, కుమారస్వామి, రవీందర్, బొమ్మకంటి శ్రీకాంత్, కుమారస్వామి, మహేందర్, ముత్యాలు, నాగరాజు, ఆనందం, చంద్రమౌళి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మడికొండ శ్రీనుకు పీహెచ్‌డీ పట్టా




**వరంగల్ వాయిస్, పరకాల:** కాకతీయ యూనివర్సిటీ (కేయూ)లో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో పరకాల వాసి మడికొండ శ్రీనుకు ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. ప్రతాప్ రెడ్డి, సీఎస్ఐఆర్ డైరెక్టర్ డి. శ్రీనివాసరెడ్డిల చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, ఎగ్జామినేషన్ కంట్రోలర్ కట్ల రాజేందర్, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎల్ బీ కాలేజీకి 8 బంగారు పతకాలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్‌లోని ప్రతిష్ఠాత్మక లాల్ బహదూర్ కళాశాల విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో ఏకంగా 8 బంగారు పతకాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. అరుణ డి.హెచ్. రావు వెల్లడించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో బంగారు పతకాలు సాధించి కళాశాలకు వన్నె తెచ్చారన్నారు. షాజియా అంజుమ్, ఐ. అనిల్, సామానుస్టీన్, రేవతి, పి.సుష్మా బాబ్జీ, ఎన్. శ్రీలేఖ, ప్రవళిక, కాథూన్ లు బంగారు పతకాలు సాధించారు. ఎంతో చరిత్ర కలిగిన లాల్ బహదూర్ కళాశాల పేరును నిలబెట్టినందుకు విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, తోటి విద్యార్థులు అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్య నారాయణ, సెక్రెటరీ ఎన్. వినయ్ కుమార్, డాక్టర్ కే. రాజేందర్ రెడ్డి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

# తపస్ సభ్యత్వ అభియాన్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) వరంగల్ మండలంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆరేపల్లి, కొత్తపేట, సుందరయ్య నగర్, నరేంద్ర నగర్, క్రిస్టియన్ కాలనీ, మట్టేవాడ వంటి పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకట రమణ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల సతీష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రాములు, నవీన్, జిల్లా బాధ్యులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, దామెర:** నానో యూరియాతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో (అగ్రికల్చర్ ఆఫీసర్) అల్లే రాకేష్ అన్నారు. సోమవారం దామెర మండలంలోని కో గీలవాయి గ్రామంలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ నానో యూరియా కణాలు చాలా చిన్నవిగా ఉంటాయని, ఇవి పంటల పెరుగుదలను మెరుగుపరుస్తూ, కిరణజన్య సంయోగ క్రియను పెంచి, పైరు ఎదుగుదలకు తోడ్పడుతుందని వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల కాలుష్యాన్ని తగ్గించి, గ్రీన్‌హౌస్ ఉద్గారాలను కూడా తగ్గిస్తుందని తెలిపారు. నానో యూరియా ఖర్చు చాలా తక్కువగా ఉంటుందని, ఇది ద్రవ రూపంలో ఉండటంతో మొక్కల ఆకులపై చల్లడానికి సులభంగా ఉంటుందని, తద్వారా నత్రజని మొక్కలకు త్వరగా, సమర్థవంతంగా అందుతుందని, ఇది మొక్కల పెరుగుదలతో పాటు అధిక దిగుబడికి కారణమవుతుందని అన్నారు. అదే సాధారణ యూరియాను వాడినట్లయితే పర్యావరణానికి హాని కలగడంతోపాటు, మొక్కలు యూరియాను పూర్తిగా వేర్ల ద్వారా తీసుకోక భూమిలో వృథా అవుతుందని వివరించారు. ఎండవేడికి ఆవిరై వాతావరణ కాలుష్యంతో పాటు జల కాలుష్యం ఏర్పడుతుందని, దీనివల్ల రైతులకు ఖర్చు పెరగడంతో పాటు భూసారం తగ్గుతుందని తెలిపారు. సాధారణ యూరియాను అధిక మొత్తంలో వాడటంతో పంటలు విపరీతంగా పెరిగి దిగుబడి తగ్గుతుందని కూడా పేర్కొన్నారు. రైతులు సాధారణ యూరియా వాడకాన్ని తగ్గించి, నానో యూరియాను ఉపయోగించాలని ఏవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

## ◆ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు పడుతున్నారని ఆవేదన




వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అలువాల నరేష్, రాష్ట్ర నాయకురాలు వి. కావ్య, వరంగల్ గ్రేటర్ కమిటీ అధ్యక్షులు వినయ్, కార్యదర్శి వంశీ, జిల్లా నాయకులు శ్రీజ, సాధన, సాత్విక, సౌమ్య, మమత, విఘ్నేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జూలై 07, 2025

# టీబీ నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**◆ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాలలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై రెండు జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గవర్నర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ, టీబీ వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, హనుమకొండ జిల్లాలో దాదాపు 9 లక్షల జనాభా ఉన్నారని తెలిపారు. ఇందులో 1.98 లక్షల మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నారని, వీరందరిని స్క్రీనింగ్, ఎక్స్ రే చేసి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో 2,04,979 మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నారని, అందులో 5,389 మందిని ఇప్పటివరకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇందులో 176 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 594 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీబీ పేషెంట్లకు పోషకాహార కిట్లను అందించేందుకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి హనుమకొండ జిల్లాకు రూ. 60 వేలు, వరంగల్ జిల్లాకు రూ. 40 వేలను అందజేశారు. అదేవిధంగా డాక్టర్ వాసవి రాకేష్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లాకు రూ. 50 వేలను, డాక్టర్ వంగ హేమంత్ రెడ్డి రూ. 20 వేలను రాష్ట్ర గవర్నర్ సమక్షంలో కలెక్టర్లకు అందజేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, డిఎంహెచ్ఓలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, రెడ్ క్రాస్ సొసైటీ నుండి డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర ఈసీ మెంబర్ ఇ.వి. శ్రీనివాస్ రావు, బిల్లా రమణారెడ్డి, ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆచార్యతో పాటు ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవాణి మృతి ప్రభుత్వ హత్యే

**ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, చల్లా ధర్మారెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మండలం మల్లక్కపేట శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకొని బలవన్మరణం చెందిన ఏకు శ్రీవాణి స్మరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్వేరోస్ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని స్వర్ణ గార్డెన్స్‌లో స్వేరో పలకరింపు, సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ముందుగా పరకాల బస్టాండ్ కూడలి నుంMR ర్యాలీగా బయలుదేరిన నాయకులు, శ్రీవాణి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం శ్రీవాణి మృతి ప్రభుత్వ హత్యే అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ సెంటర్ చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభా ప్రారంభంలో మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాప సభను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్వేరోస్ నాయకులు, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** కాకతీయ యూనివర్సిటీకి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వస్తున్న సందర్భంగా ఆయనను కలిసేందుకు వచ్చిన విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో బంధించడంపై అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏ ప్రజాస్వామిక హక్కుల రక్షణ గ్యారెంటీ అని కాంగ్రెస్ పాలకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారుజామున ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గడ్డం నాగార్జున సహా పలువురు విద్యార్థి నాయకులను, గవర్నర్‌ను కలిపిస్తామని పిలిపించి అరెస్ట్ చేయడం ఏమిటని, ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటే అని పల్లె మురళి ప్రశ్నించారు. చీటిమాటికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కనీస ప్రాథమిక హక్కులను అణచివేతకు పాల్పడితే అవకాశం కోసం కాచుకుని ఉన్న మనువాద కార్పొరేట్ ప్రజా వ్యతిరేక శక్తులు గద్దె ఎక్కుతాయనే వాస్తవం కాంగ్రెస్ పాలకులు గుర్తించి మసలుకోవాలని, అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలు విరమించుకోవాలని, తక్షణమే విద్యార్థి నాయకులు, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఇతర సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులను విడుదల చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండలంలోని తెల్లబండతండా గ్రామం నుంచి విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ పాఠశాల స్కూల్ బస్సును ప్రభుత్వ ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. తెల్లబండతండా గ్రామం నుంచి చిల్కోడులోని లిటిల్ మైండ్స్ ప్రైవేట్ స్కూల్‌కు విద్యార్థులను తరలించేందుకు వచ్చిన బస్సులను చిల్కోడు, తెల్లబండ తండా గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. నాలుగు, ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు అంగన్‌వాడీ పాఠశాలలో చదవాల్సిన వయసులో, లిటిల్ మైండ్స్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం వారి స్కూల్ బస్సులో తరలించడాన్ని ప్రభుత్వ పాధ్యాయులు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. వారి డిమాండ్‌ను ఏకీభవించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం అందించి, ఆటపాటలతో పాటు చదువు చెబితే తప్పకుండా ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. నాలుగు సంవత్సరాలలోపు చిన్నారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉండకూడదని నిబంధనలు తెలిసినప్పటికీ, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ శాఖ అధికారులు వీటిపై నోరు మెదపకపోవడం గమనార్హం.

# ఐఐఐటీ బాసర విద్యార్థికి సన్మానం



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన డోర్నకల్ మండలం కన్నెగుండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ షాహిదాకు ఘన సన్మానం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంగోత్ లక్ష్మ నాయక్, ఉపాధ్యాయులు మాధవరావు, కోవిలా రాజేశ్వర్, రామూర్తి, వెంకట్రామ నర్సయ్య, వెంకన్న, లోకేందర్ రెడ్డి, దస్తగిరి, ఖాసీం, ఉరియాలు కలిసి షాహిదాతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించారు. షాహిదాకు మెమెంటోను బహుకరించారు. ఈ సందర్భంగా ఐఐఐటీలో సీటు సాధించిన షాహిదా మాట్లాడుతూ, ఇంజనీరింగ్ ఉత్తీర్ణత సాధించి గ్రామ, మండల ప్రజలకు సేవ చేస్తానని ప్రకటించారు. టీచర్స్, పేరెంట్స్ తరపున చెక్కల రవితో పాటు మరికొందరు కలిసి ఆమెకు ఆర్థిక సహాయం అందించారు.

# సేఫ్టీ మోకులు వెంటనే మంజూరు చేయాలి



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు (రక్షణ పరికరాలు), పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బోనగాని యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ మండలం ఐనవోలు మండల కేంద్రంలో తండ వెంకన్న గౌడ్ అధ్యక్షతన సోమవారం గౌడ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు (కిట్లు) ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గీత కార్మికులు తాటిచెట్లపై నుంచి పడి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సర కాలంగా ప్రమాదవశాత్తు తాటిచెట్లపై నుంచి పడి చనిపోయిన వారికి బీసీ కార్పొరేషన్ చెల్లించాల్సిన రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. గాయపడిన గీత కార్మికులకు ఆసుపత్రి ఖర్చుల కోసం చెల్లించే రూ. 25 వేలు, అలాగే చనిపోయిన గీత కార్మికులకు రూ. 25 వేలు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని యాదగిరి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఎక్స్‌గ్రేషియా, సేఫ్టీ మోకులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల రాష్ట్ర నాయకులు జనగాం శ్రీనివాస్ గౌడ్, అనంతుల రమేష్ గౌడ్, పూజారి విజయ్ కుమార్ గౌడ్, బట్టుపల్లి గౌడ సంఘం అధ్యక్షులు పూజారి రఘు గౌడ్, పూజారి శివకుమార్ గౌడ్, రంగు సత్యనారాయణ గౌడ్, పూజారి కుమారస్వామి గౌడ్, పూజారి వీరాస్వామి గౌడ్ పాల్గొన్నారు.

# బూత్ స్థాయి అధికారులకు శిక్షణ




**వరంగల్ వాయిస్, గణపురం:** భూపాలపల్లి జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆదేశాల మేరకు గణపురం మండలంలోని రైతువేదికలో సోమవారం బూత్ స్థాయి అధికారులకు “జాతీయ స్థాయి శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం” నిర్వహించారు. ఎం.సత్యనారాయణ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని బూత్ స్థాయి అధికారులు అందరూ పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి శిక్షణ అధికారులు నక్క తిరుపతి, గోనె శ్రీనివాస్, నరేష్ హాజరై బూత్ స్థాయి అధికారులకు సమగ్రమైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, గణపురం, బూత్ స్థాయి సూపర్వైజర్లు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సిబ్బందితో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## జడ్జి కంచ ప్రసాద్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన న్యాయమూర్తి కంచ ప్రసాద్ సోమవారం కాకతీయ యూనివర్సిటీ (కేయూ) స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. గవర్నర్ జీష్ణుదేవ్ వర్మ నుంచి డాక్టరేట్ అవార్డును పొందిన డాక్టర్ కంచ ప్రసాద్‌ను 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ వారి నివాస గృహంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ, ఎల్.ఎల్.బీ., ఎల్.ఎల్.ఎం. విద్యను పూర్తి చేసి, ఒక జడ్జిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే న్యాయ శాస్త్రానికి సంబంధించిన అంశంపై పరిశోధన చేసి ఈరోజు డాక్టరేట్ సాధించిన ప్రసాద్ తమ 42వ డివిజన్ రంగశాయిపేట వాస్తవ్యుడు కావడం తమందరికీ గర్వకారణమని, వారికి మరొకసారి శుభాకాంక్షలు

## బీజేపీ చీఫ్‌ను కలిసిన డాక్టర్ వన్నాల వెంకట రమణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** అంతర్జాతీయ డాక్టర్స్ కాన్ఫరెన్స్‌లో భాగంగా వారం రోజుల విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ, సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన ఎన్. రామచందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గణనీయమైన అనుభవం, విలక్షణ నాయకత్వం కలిగిన రామచందర్ రావు గారి నేతృత్వంలో బీజేపీ తెలంగాణలో మరింత బలపడుతుందని తనకు నమ్మకం ఉందని డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు. వారి ఆధ్వర్యంలో స్థానిక సంస్థలను కైవసం చేసుకుంటామని, ప్రజల సమస్యలపై వారితో పాటు పోరాడుతానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకట రమణ వెంట రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కొల్లి మాధవి పాల్గొన్నారు.

## 9న సమ్మెను విజయవంత చేయాలి

### తాటిపాముల వెంకట్రాములు పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లుగా పాలన చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్, పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తోందని వెంకట్రాములు విమర్శించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అనేక కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు, కష్టనష్టాలకు ఓర్చి పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా రైతాంగాన్ని ఇబ్బందుల పాలు చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కూనూరు పాఠశాలకు జాతీయ గుర్తింపు

◆ ప్రభుత్వ పాఠశాలలకు గర్వకారణం
◆ టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రశంస



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలంలోని కూనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వించదగిన విషయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పాఠశాలను ఈ స్థాయికి తీసుకెళ్లిన పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. గత డిసెంబర్ 21, 22వ తేదీల్లో కూనూరు ఉన్నత పాఠశాలలో 1974 నుంచి 2024 సంవత్సరాలకు చెందిన 50 టెన్త్ బ్యాచ్‌లకు చెందిన 5 వేల మంది పూర్వ విద్యార్థులు రెండు రోజుల పాటు నేత్రపర్వంగా సమ్మేళనం నిర్వహించారు. ఈ వేడుకల్లో 150 మంది పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా "కూనూరు జ్ఞాపకాల హరివిల్లు" పేరిట 300 పేజీల మల్టీకలర్ ప్రత్యేక సావనీర్‌ను ప్రచురించారు. ఈ పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం ★★"తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్"★★లో చోటు సంపాదించుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి హనుమకొండలోని వరంగల్ దర్శన్ సెమినార్ హాల్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో కూనూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎండీ ఫర్వేజ్‌కు, స్కూల్ అల్యూమినీ అసోసియేషన్ కమిటీకి ముఖ్య అతిథి టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా జ్యూరీ చైర్మన్, జ్యూరీ చీఫ్ కో–ఆర్డినేటర్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుతోపాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయుల కృషి, గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సహకారం ఉంటే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని, గుర్తింపు వస్తుందని, దీనికి కూనూరు పాఠశాలే నిదర్శనమని అన్నారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చింతపట్ల వెంకటాచారి, జ్యూరీ చీఫ్ కో–ఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్‌లు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఈ మధ్యకాలంలో బ్యాచ్‌ల వారీగా రాష్ట్రవ్యాప్తంగా నిత్యం జరుగుతూనే ఉన్నాయని అన్నారు. కానీ, ఏకకాలంలో రెండు రోజుల పాటు వేలాది మంది పూర్వ విద్యార్థులు తరలివచ్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం ఇదే ప్రథమమని అన్నారు. ఈ ఘనత కూనూరు విద్యార్థులకే దక్కిందన్నారు. అందుకే తమ ఫౌండేషన్ ఈ పాఠశాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించినట్లు ప్రకటించారు. తిరునగరి నరేందర్ సమన్వయకర్తగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ అల్యూమినీ కమిటీ చైర్మన్ నాగమళ్ల అశోక్ అధ్యక్షత వహించారు. చివరగా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు వందన సమర్పనం చేశారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల విజయానికి తోడ్పడిన వారికి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల కుమారస్వామి, పిట్ట రాజు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, అమరాజు శ్రీనివాస్, ముత్తడి రాంరెడ్డి, గిరిజన విద్యాపీఠం డీన్ గడ్డం వెంకన్న, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు ఎం. తిరుపతిరెడ్డి, పీ. శ్రీహరి, ఎం. మహేందర్‌రెడ్డి, టీ. శ్రీనివాస్, ఎ. ఉపేందర్‌రెడ్డి, పీ. విజయపాల్‌రెడ్డి, కూనూరు పూర్వ ఉపాధ్యాయులు పొడిచేటి శ్రీనివాసాచారి, సుధాకర్, రామకృష్ణ, శోభారాణి, సత్యనారాయణ, సోమయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

**వరంగల్ వాయిస్, వరంగల్:** కాకతీయ విశ్వవిద్యాలయం23వ స్నాతకోత్సవం సోమవారం విశ్వవిద్యాలయ క్యాంపస్ ఆడిటోరియంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్‌లోని శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీఏ (ఎల్) విభాగ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి గౌరవ బంగారు పతకాలను సాధించడం గర్వకారణంగా నిలిచింది. గోల్డ్ మెడల్ విజేతలు బండారి రమణి, ధరావత్ వెంకన్న, రాజబోయిన యాదలక్ష్మిలు కాగా, వీరు తమ కోర్సుల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో అగ్రస్థానాలు సాధించి, గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారన్నారు. ఈ ఘనత విద్యార్థుల కృషికి, అధ్యాపకుల మార్గదర్శనానికి, కళాశాల శిక్షణ ప్రమాణాలకు ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంలో కళాశాల అధ్యక్షులు ఆకారపు హరీష్ కుమార్, కార్యదర్శి ఆచార్య చిలకమారి సంజీవ, కోశాధికారి చక్కిలం ఉపేందర్, ప్రిన్సిపాల్ సోనబోయిన సతీష్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులందరూ విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయం కళాశాల ప్రతిష్ఠను పెంచడమే కాక, భవిష్యత్ విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

## మహాధర్నాను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 9న ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల హక్కుల సాధనకై నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్.హెచ్.ఎం. (నేషనల్ హెల్త్ మిషన్) కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన డాక్టర్ రమ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. ఎన్.హెచ్.ఎంలో వివిధ భాగాల్లో పనిచేస్తున్న 78 క్యాడర్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, రంగశాయిపేట అకౌంటెంట్ మృదుల, ఏ.ఎన్.ఎం.లు విజయలక్ష్మి, శారద, శ్రీలత, మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి పర్యటనకు సన్నాహాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ.. మహబూబాబాద్ జిల్లాలో భారీ పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మరో ఐదుగురు మంత్రులు, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిలు రూ. 400 కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ పర్యటనలో భారీ బహిరంగ సభలు కూడా నిర్వహించనున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ పరిశీలించారు. సోమ్లా నాయక్ తండా సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి తండాకు వెళ్లే రహదారి మార్గాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మహబూబాబాద్ మండలంలో రూ.100 కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, సభ వేదికకు చేరుకొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం భోజనం ముగించుకొని రోడ్డు మార్గాన కేసముద్రం చేరుకొని రూ. 300 కోట్ల రూపాయలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించి, మధ్యాహ్నం 3 గంటలకు సభ వేదికకు చేరుకొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వర్షం కారణంగా సభ ప్రాంగణం బురదమయం కావడంతో పనులకు కొంత ఆటంకం ఏర్పడుతోంది. మహబూబాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం ఇంకా వెలువడాల్సి ఉంది.



# కింగ్డమ్ రిలీజ్‌కు సిద్ధం

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'కింగ్డమ్'. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ ఇంటెన్స్ యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్, గ్లింప్సెస్ చూసిన ప్రతి ఒక్కరికీ ఆయనలో కొత్త యాంగిల్ కనిపిస్తోంది. ఈ పాత్ర కోసం విజయ్ భారీగా ట్రాన్స్‌ఫర్మ్ అయినట్టు– సమాచారం. అతని పెర్ఫార్మెన్స్ ఈసారి మరో లెవెల్‌లో ఉండనుందట. ఇక భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా.. ఇటీవల వరుస వాయిదాలు తీసుకుంటూ వచ్చిన 'కింగ్డమ్', ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకుంది. ఇప్పటికే రిలీజ్ వాయిదాల కారణంగా నిరాశ చెందిన ఫ్యాన్స్ ఇప్పుడు ఊపిరి పీల్చు కుంటు–న్నారు. మొత్తనికి 'కింగ్డమ్' మూవీ, ఇప్పుడు దూసుకెళ్లేందుకు సిద్ధమైంది. అభిమానులకూ, బాక్సాఫీస్‌కి ఇది మంచి ఉత్సాహం కలిగించే సినిమా కావొచ్చని ఇండస్ట్రీలో జోరుగా చర్చ సాగుతోంది.



# సినిమా బిజీలో ముఖ్యమైన అదే కోల్పోతున్నా

**స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ఆవేదన**

పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా వెలుగొందుతున్న అందాల నటి రష్మిక మందన్న. ఇటీవల ఈ ముద్దుగుమ్మ నటించిన ప్రతి సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. అయితే కెరీర్‌లో అగ్రస్థాయికి చేరుకున్నా, దాని వెనక తన వ్యక్తిగత జీవితంలోచేసిన త్యాగాలు, ఎడబాటు– గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయింది. రష్మిక ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నేను దాదాపు ఏడాదిన్నరగా మా ఇంటికి వెళ్లలేకపోయాను. నా చెల్లి ఇప్పుడు 13 ఏళ్లు. ఆమెతో గడిపే అమూల్యమైన క్షణాలను కోల్పోతున్నానని ఎప్పుడూ బాధగా అనిపిస్తుంది. ఒక్కోసారి శని, ఆదివారాలు ఇంట్లో ఉండాలనిపిస్తుంది... సెలవు దొరక్క ఏడుపొస్తుందని బాధపడిరది. కేవలం కుటుంబం మాత్రమే కాదు, స్నేహితుల నుండి కూడా దూరం అయ్యాను. ఒకప్పుడు చిన్న చిన్న ట్రిప్స్‌కు, పార్టీకి నన్ను పిలిచే స్నేహితులు ఇప్పుడు కాల్ చేయడం మానేశారు. . తన తల్లి చెప్పిన మాటలని కూడా రష్మిక గుర్తు చేసుకుంది.





## చిరుతో.. వెంకీ

స్టార్ హీరో వెంకటేశ్ తన రానున్న సినిమాల లైనప్ చెప్పి అభిమానుల్లో జోష్ నింపారు. అమెరికాలో వైభవంగా జరిగిన 'నాట్స్ 2025'లో సందడి చేసిన వెంకటేశ్ తన సినిమాల గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకీ చిరంజీవి సినిమాలో కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని వెంకీ మామ కూడా ధ్రువీకరించారు. ఆ పాత్ర ఎలా ఉంటుందో కూడా చెప్పారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నా. అలాగే చిరంజీవి సినిమాలో అతిథి పాత్రలో నటిస్తున్నాను. అది చాలా ఫన్నీగా ఉంటుంది. ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. అలాగే మీనాతో కలిసి 'దృశ్యం 3' సినిమా చేస్తున్నా. ఇటీవల అనిల్ రావిపూడితో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం'తో హిట్ కొట్టాం. మేమిద్దరం మళ్లీ రాబోతున్నాం. వీటన్నింటితో పాటు– మరో భారీ ప్రాజెక్ట్‌లో నా స్నేహితుడితో కలిసి నటిస్తున్నాను. వచ్చే సంక్రాంతికి అనిల్ రావిపూడి – చిరంజీవి కాంబోలో రానున్న సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. వినోదంతో పాటు– బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్–టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో వెంకటేశ్ కనిపించనున్నారు. ఇందులో చిరు సరసన నయనతార నటిస్తున్నారు. దీంట్లో శివశంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో చిరు సందడి చేయనున్నారు.

# నా దృష్టి అంతా దానిపైనే

దర్శకుడు లోకేశ్ కనగరాజ్ భావోద్వేగం కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, యంగ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'ఆగస్ట్ 14న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ సినిమాపై, అభిమానులో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాలో రజనీకాంత్ ఓ మాస్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించనున్నారు. యాక్షన్, ఎమోషనల్ అంశాలతో కూడిన ఈ కథకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే రిలీజ్ అయిన టైటిల్ రివీల్ వీడియోలో రజిని లుక్ సంచలనంగా మారింది. ఇక తాజాగా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు భావోద్వేగానికి లోనయ్యేలా ఉన్నాయి.

రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన లోకేశ్ కనగరాజ్.. 'గత రెండేళ్లుగా నాకు 'కూలీ' తప్ప మరే విషయంపై ధ్యాస లేదు. నా కుటుంబం, స్నేహితులు, వ్యక్తిగత జీవితమంతా పక్కనపెట్టి.. నేను పూర్తిగా ఈ సినిమాకు అంకితమయ్యాను. నా 36, 37వ పుట్టినరోజులను కూడా జరుపుకోలేదు. ప్రజంట్ నాకు అలాంటి జ్ఞాపకాలు అవసరం అనిపించడం లేదు. నా సుదీర్ఘ ప్రయాణంలో ఇదొక కీలకమైన దశ. రజనీసార్ సినిమాను పూర్తి ఫోకస్‌తో చేయాలన్నది నా ఏకైక లక్ష్యం. ఎందుకంటే 'విక్రమ్' తర్వాత 'లియో' చిత్రాన్ని తక్కువ టైం లో పూర్తి చేయాలన్న ఆలోచనతో, కొన్ని ముఖ్యమైన అంశాలు పట్టించుకోలేదు. అందుకే ఈసారి మాత్రం ప్రతి చిన్న విషయాన్ని పర్ఫెక్షన్‌తో చేయడమే లయంగా పనిచేశాను' అంటూ తెలిపారు. ఇక 'కూలీ' కోసం లోకేశ్ కనగరాజ్ చేసిన త్యాగం, అతని డెడికేషన్ చూసిన తర్వాత, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు మరింత పెరిగాయి.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జూలై 07, 2025

# పర్యాటకంగా కర్రె గుట్టలు

- లక్ష కోట్లతో రైతులకు సంక్షేమ ఫలాలు
- నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రకృతి అందాలకు ఆలవాలమైన కర్రె గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. రైతులను రాజు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోని రైతులకు లక్ష అయిదు కోట్ల రూపాయలు అందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామని ప్రకటించారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపో వద్దని సూచించారు. అదే విధంగా విత్తన చట్టాన్ని రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాల్లో 1,521 ఎకరాల్లో మొక్కజొన్న వేసి పంట నష్టపోయిన 671 రైతులకు రాష్ట్ర పంచాయతీ రాజ్శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటీడిఏ పీఓ.చిత్ర మిశ్రాలతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రూ.3,80,97,264 విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు.

### విత్తన చట్టాన్ని రూపొందిస్తున్నాం..

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతులందరికీ జిల్లా అధికారుల సమిష్టి కృషితోనే ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని రైతులకు లక్ష అయిదు కోట్ల రూపాయలు అందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. రైతులు విత్తనాలతో మోసపోకుండా రాష్ట్రంలో విత్తన చట్టాన్ని రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఆదివాసీల జీవన విధానంలో మార్పు రావడానికి మంత్రి సీతక్క ప్రజా జీవితాన్ని ప్రారంభించడం గొప్ప విషయమని, ప్రైవేటు కంపెనీల యజమానుల మెడలు వంచి రైతులకు నష్టపరిహారం అందించడం జిల్లా అధికారుల కృషి ఎన్నటికీ మరువలేమని అన్నారు. .

### ఐదు నెలల పోరాట ఫలితం..

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఐదు నెలల పోరాట ఫలితంగా నేడు రైతులు ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్ట పరిహారం పొందుతున్నారని, ఇది చరిత్రలోనే నిలిచిపోతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పలుసార్లు సమావేశాలు నిర్వహించడమే కాకుండా ప్రైవేట్ కంపెనీలను ఒప్పించడంలో విజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో లారీల సమస్య అధికమైందని సమస్య పరిష్కారం కోసం జిల్లా పోలీసు యంత్రాంగంతో చర్చించడం జరిగిందని, అవసరాలను దృష్టిలో ఉంచుకొని పలువురు మోసానికి గురి చేస్తారని తెలిపారు. దళారీ వ్యవస్థ రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బదులు కావాలని పిలుపు నిచ్చారు. ప్రజలను రైతులను ఎవరు మోసం చేసిన నష్టపరిహారం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇది రైతులు సాధించిన విజయం అని, ఐదారు నెలలుగా ఈ సమస్య పై పోరాట ఫలితం అని అన్నారు. మల్టీనేషనల్ కంపెనీలతో ఫైట్ చేసి నష్టపరిహారం చెల్లించేలా చూశాం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల సంక్షేమ కమిషన్ సభ్యులు మరికాంతి భవాణి, రాములు నాయక్, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, కేవీ నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాల సాని లక్ష్మీనారాయణ, ఏఎస్ పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, అదనపు ఎస్ పి సదానందం, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆందోళన

- ములుగులో ఉద్రిక్తత
- గులాబీ నేతల ముందస్తు అరెస్ట్
- పోలీస్ బందోబస్తు నడుమ మంత్రుల పర్యటన

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ములుగు మండలం చల్వాయి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు రాలేదని వాట్సాప్ గ్రూప్ లో ప్రశ్నించిన ఓ వ్యక్తిపై కాంగ్రెస్ నాయకులు, పోలీస్ లు వేధింపులకు గురి చేయడం మూలంగానే సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు జాతీయ రహదారిపై గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేష్ ఆత్మహత్య ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ హత్యే అంటూ నినాదాలు చేశారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి, మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ సతీష్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పాల్గొన్నారు. ములుగు జిల్లాలో అమలవుతున్న పోలీస్ ఎమర్జెన్సీ యాక్ట్ ను వెంటనే ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఎమర్జెన్సీ.. ములుగు జిల్లాలో సీతక్క ఎమర్జెన్సీ అంటూ ఆరోపించారు. . చుక్కా రమేష్ ఆత్మహత్య వెనుక ఉన్నవారు ఎవరో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలంటూ నిలదీశారు. గాంధీ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు జాతీయ రహదారిపై ర్యాలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ర్యాలీగా వచ్చిన కార్యకర్తలకు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి గేటు ముందు కలవగా, వాహనాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డగించి ఆత్మహత్య చేసుకున్న చుక్కా రమేష్ కు న్యాయం చేయాలంటూ కోరారు. కలెక్టర్ కార్యాలయం ముందు కొంతసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం జాతీయ రహదారి వైపు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులకు బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. బీఆర్ఎస్ నాయకులను అడ్డగించి అరెస్టు చేసిన పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్ లో ఎక్కించి వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు డౌన్, డౌన్ కాంగ్రెస్ డౌన్..డౌన్, సీతక్క డౌన్ డౌన్ అంటూ నినాదాలు హోరెత్తాయి. కాగా, పోలీసుల బందోబస్తు నడుమ ములుగు జిల్లాలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరావు ల పర్యటన కొనసాగింది.

# 23 ఎజెండా అంశాలు..

- మేయర్ సుధారాణి అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన 23 ఎజెండా అంశాలకు ఆమోదం తెలుపడంతోపాటు రూ.149.29 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా నిధుల మంజూరు చేస్తున్నారని తెలిపారు. అందులో సాధారణ నిధులు (జనరల్ ఫండ్స్) ద్వారా రూ.62.15 కోట్లు, డివిజన్ కు రూ.50 లక్షల చొప్పున రూ.33 కోట్లు, ఇతర పనులకు రూ.24.05 కోట్లు, హంటర్ రోడ్ 12 మోరీల కూడలి అభివృద్ధికి రూ.2 కోట్లు, వీధి దీపాలకు రూ.2 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.18.18 కోట్లు ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్టాంపు డ్యూటీ నిధుల ద్వారా కొత్తగా అభివృద్ధి పనులు ప్రతిపాదించడం జరిగిందని, రూ.41.56 కోట్లు డివిజన్లకు, భద్రకాళి చెరువులో మ్యూజికల్ లైటింగ్ కు రూ.13.50 కోట్లు, అమృత్ 2.0 పథకం ద్వారా రూ.14 కోట్లు, ఎస్సీఎం నిధులలో రూ.6 కోట్లతో ఆస్తిపన్ను అసెస్మెంట్లపై సర్వే, రూ.4 కోట్లతో స్మార్ట్ నీటి సరఫరా యంత్రాలు, రూ.4 కోట్లతో నిల్వ వ్యర్థాల శుద్ధీకరణకు కేటాయించడం జరిగిందని తెలిపారు.

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో తరచుగా విద్యుత్ సమస్యలను అధిగమించుటకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజా ప్రభుత్వంలో అన్ని డివిజన్లకు నిధులు విరివిగా మంజూరు చేయడం జరిగిందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మిగిలి ఉన్న నాలాల్లో డీసిల్టింగ్ త్వరితంగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత పక్కగా జరగాలని, దీనిపై క్వాలిటీ కంట్రోల్ విభాగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, ఇంకను ప్రారంభించని గుత్తేదారులను తొలగించి ఇతరులకు అప్పజెప్పాలని అన్నారు. ఆరు మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తేనే నూతన గృహ నిర్మాణం అనుమతి మంజూరు నిబంధన ప్రవేశపెట్టాలన్నారు. కార్పొరేషన్ లో దమాంషా ప్రకారం పారిశుద్ధ్య ఇతర సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఆక్ట్ 2019 ప్రకారం విలీన గ్రామాల్లో, దారిద్ర్య రేఖకు దిగువనున్న, అల్ప సంఖ్యాక వర్గాల వారు నివసించే ప్రాంతాల అభివృద్ధి కి కార్పొరేషన్ బడ్జెట్లో 1/3 నిధులను కేటాయించాలన్నారు. స్మశాన వాటికలకు, చెరువులకు ఎఫ్ టిఎల్ నిర్ణయించి హద్దులను ఏర్పాటుచేసి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. విలీన గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలన్నారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాలకు అధిక నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులు కార్పొరేటర్లు అధికారులు సమష్టిగా గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి పాటుపడుదామన్నారు.

ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్లలో నెలకొన్న పలు సమస్యల గురించి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, మంచినీటి సరఫరా, అభివృద్ధి పనులు మంజూరైనను ప్రారంభించకపోవడం, మురుగు కాలువలు, అంతర్గత రహదారుల ఏర్పాటు తదితర సమస్యల గురించి తెలుపగా, సంబంధిత విభాగాల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించారు. అంతకుముందు బల్దియా ప్రధాన కార్యాలయంలో పునరుద్ధరించిన కౌన్సిల్ హాల్ ను నగర మేయర్ గుండు సుధారాణి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలసి ప్రారంభించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన మసూద్ షమీం, కార్పొరేట్లతో పాటు బల్దియాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఎన్ పీడీసీఎల్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నిరసన..

మహా నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ప్రారంభించిన కొద్దిసేపటికి బీఆర్ఎస్ కార్పొరేటర్లు సభను బహిష్కరించి బయటికి వచ్చారు. భద్రకాళి చెరువు విషయంలో చర్చ జరగాలంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరినప్పటికీ మేయర్ అనుమతి ఇవ్వకపోవడంతో వారు సమావేశాన్ని బహిష్కరించి బయటికి వచ్చి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com